

కొనసాగుతున్న ఈసెట్ కౌన్సెలింగ్

కరీంనగర్ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రెండోరోజు బుధవారం 397 మంది విద్యార్థులకు ఈ సెట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండో రోజు స్లాట్ బుక్ చేసుకున్న 397 మంది విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసినట్లు ప్రిన్సిపాల్ డి శోభారాణి తెలిపారు. గురువారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ చివరి రోజని, స్లాట్ బుక్ చేసుకోని విద్యార్థులు బుక్ చేసుకొని కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని సూచించారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

● అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్

చిగురుమామిడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):రైతుల భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని రామంచలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సును ఆమె పరిశీ లించారు. ఆ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి కొందరు అదనపు కలెక్టర్‌ను కలిసి తమ ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆమె మాట్లా డుతూ రైతులకు అధి కారులు అందు బాటులో ఉండి సమస్య లను పరి ష్కరించాలన్నారు. ఇళ్ల పట్టాల విషయం కలెక్టర్ దృష్టికి తీసుకు పోయి న్యాయం చేస్తా నని తెలిపారు. రెవిన్యూ సదస్సులో 154 దరఖా స్తులు వచ్చినట్లు తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్, తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఆర్ఐ అరుణ్ పాల్గొన్నారు.



రామంచలో జరిగిన రెవెన్యూ సదస్సు లో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్

ఆర్టీసీ బాదుడు



- అన్ని రూట్లలో పెరిగిన చార్జీలు
- టోల్ ప్లాజా రూట్లలో అధికం
- పెరిగిన స్టూడెంట్‌పాస్‌రేట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుట్టు చప్పుడు కాకుండా ఆర్టీసీ చార్జీలను పెంచి ప్రయాణికులపై భారం మోపింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, గోదావరి ఖని, మంథని, హుస్నాబాద్, హుజూరాబాద్ డిపోలు ఉన్నాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ రేట్లను పెంచడంతో తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కూడా టోల్ ప్లాజా యూజర్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. టోల్‌ప్లాజాలు ఉన్న ఉన్న రూట్లలోనే కాకుండా అన్ని రూట్లలో చార్జీలు ఒక్కసారిగా పెంచింది. టోల్‌ప్లాజాలా మీదుగా వెళ్లే ప్రయాణికుడి నుంచి అదనంగా పది రూపాయలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ రూట్‌లో రెండు టోల్ ప్లాజాలు ఉంటే ఇరవై రూపాయలు చార్జీలు వసూలు చేస్తున్నారు.

● రూ. 10 నుంచి 20 వరకు..

ఒక్కో రూట్‌లో పది రూపాయల నుంచి 20 రూపాయల వరకు చార్జీలు పెంచారు. వేములవాడకు గతంలో 50 రూపాయలు ఉంటే 60, జగిత్యాలకు 70 ఉంటే 80, హుజూరాబాద్‌కు 60 నుంచి 70, హన్మకొండకు 100 నుంచి 110, వరంగల్‌కు 110 నుంచి 120, మంథనికి 100 ఉంటే 110, పెద్దపల్లికి 60 ఉండగా 70, సిద్దిపేటకు 100 ఉంటే 120, హైదరాబాద్‌కు 230 నుంచి 260 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ రూట్‌లో రెండు టోల్ ప్లాజాలు ఉండడంతో అదనంగా 30రూపాయలు పెంచారు. అన్ని రూట్లలో పదిరూపాయలుపెంచుతూ ఆర్టీసీ నిర్ణయం తీసుకున్నది. తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చార్జీలు

(మిగతా 8వ పేజీలో)

రేపు ఒలింపిక్ డే రన్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ డే రన్‌ను ఈ నెల 20న నిర్వహించనున్నామని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 6 గంటలకు ఈ రన్ ప్రారంభమై భగత్‌నగర్, కలెక్టరేట్, తెలంగాణ చౌక్ చేరుకుని తిరిగి స్టేడియంకు చేరుకుంటుం దన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

● విజయవంతం చేయండి

ఒలింపిన్ రన్‌ను విజయవంతం చేయాలని ప్రైవేట్ పీఈటీల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని శ్రీధర్‌గౌడ్, దారం గౌతమ్‌రెడ్డి, కోశాధికారి కంకటి అనూప్ కుమార్ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఒలింపిక్ రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో బొల్లి మహేష్, శివ, కొలిపాక లక్ష్మీనారాయణ, పుష్పలత పాల్గొన్నారు.

మూడు రోజులు.. రూ. 106 కోట్లు

- 1,52,034 మంది ఖాతాల్లో 'రైతు భరోసా' జమ
- ఇప్పటికే ట్రెజరీకి చేరిన రూ. 184.88 కోట్లు
- కొత్త రైతులకు అందనున్న సాయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గడిచిన మూడు రోజుల్లో జిల్లాకు చెందిన రైతులకు 106 కోట్ల రూపా యల రైతు భరోసా సాయం అందింది. ఈ నెల 16న రైతు భరోసా సహాయం విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించగా ఆ రోజు నుంచే రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ కావడం మొదలయింది. మూడు రోజుల్లో మూడెకరాల భూమి ఉన్న రైతులందరి ఖాతాల్లో డబ్బు జమ చేశారు. 1,52,034 మంది రైతుల ఖాతాల్లో 106,05,11,225 రూపాయలు జమయ్యాయి. ఈ వానాకాలంలో 2,10,904 మంది రైతులకు 211.9 కోట్ల రూపాయలు రైతు భరోసా సాయంగా అందివ్వాల్సి ఉంటుందని ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికే 1,96,004 మంది రైతుల వివరాలను ఏఈవోలు ధ్రువీకరించగా 1,95,341 మంది రైతుల వివరాలను మండల వ్యవసాయ అధికారులు పరిశీలించి అర్హతను ధ్రువీకరించారు. వీరిలో 1,83,868 మంది రైతులకు ఇవ్వాల్సిన 184,88,81,711 రూపాయలను ట్రెజరీకి పంపించారు.

● 20లోగా కొత్త రైతులు ధ్రువపత్రాలు ఇవ్వాలి

కొత్తగా భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులకు కూడా రైతు భరోసా సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 5లోపు రిజిస్ట్రేషన్ అయి ఉన్న వ్యవసాయ భూములకు ఈ భరోసా సాయాన్ని అందిస్తారు. ఆయా రైతులు ఈ నెల 20 వరకు భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, మ్యుటేషన్ చేయించుకుని యాజమాన్య హక్కులు పొందిన పత్రాలను వ్యవసాయ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. వ్యవసాయ అధికారులు ఆ వివరా లను పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయ గానే రైతుల ఖాతాల్లో భరోసా సాయం జమ అవుతుంది. కొత్త రైతు లందరు తమ భూ యాజ మాన్య వివరాలను అధికా రులకు అందించి భరోసా సాయాన్ని పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు.



మత్తుపదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు

● పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. మత్తు పదార్థాల విక్ర యం, రవాణాను అరికట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలో నార్కోటిక్ సెల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎవరైనా వ్యక్తుల వద్ద ప్రభుత్వం నిషేధించిన గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు ఉన్నా, వాటిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించా లని సీపీ విజ్ఞప్తి చేశారు. నార్కోటిక్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలం లియో తో కరీంనగర్‌లోని ముఖ్యకూడళ్లు, బస్టాండ్, పార్సిల్ కార్యాలయాలు, కిరాణా షాపులు, పాన్ షాపులు, హాస్టళ్లు, ఇతర అనుమానిత ప్రదేశాల్లో కరీంనగర్ ఒకటో టౌన్ ఎస్ఐ రాజన్న ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో పోలీస్ జాగి లం హ్యాండ్లర్ ఎ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



నార్కోటిక్ జాగిలం లియోతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వేళాయే

- రాష్ట్ర వ్యాప్తంగా 8 యూనివర్సిటీల్లో దరఖాస్తుకు షెడ్యూల్ విడుదల
- జూలై 17 వరకు తుదిగడువు

7

చదువుదాం... చదివిద్దాం

- నేడు జాతీయ పఠన దినోత్సవం...

7

జమ్మికుంట-హుజూరాబాద్ ప్రయాణం గగనం

- జనంతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు
- నిత్యం 130 ట్రిప్పుల రాకపోకలు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

జమ్మికుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట-హుజూరాబాద్ పట్టణాల మధ్య ప్రయాణించే ఆర్టీసీ బస్సులు నిత్యం ప్రయాణికుల రాకపోకలతో కిటకిటలాడుతూ ఉంటాయి. ప్రతి రోజు పది బస్సులు జంట పట్టణాల మధ్య 130 ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఎప్పుడు చూసినా బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఆర్టీసీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హన్మకొండ, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లే ప్రజలు హుజూరాబాద్ మీదుగా వెళ్తుంటారు. రైలు మార్గం కోసం హుజూరాబాద్ చుట్టూ ప్రాంతాల నుంచి జమ్మికుంటకు ఎక్కువగా వస్తుంటారు. రైళ్లు వచ్చి వెళ్లే సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసి పోతుంది. ఉదయం 5గంటలకు హుజూరాబాద్ నుంచి జమ్మి కుంటకు, జమ్మికుంట నుండి హుజూరా బాద్‌కు 4.45కి ఆర్టీసీ బస్సులు ప్రారంభం అవుతాయి. జమ్మికుంట నుంచి హుజూరాబా ద్‌కు చివరి బస్సు 9 గంటలకు ఉంది. హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు రాత్రి 10.10 గంటలకు చివరి బస్సు ఉంటుంది. ఆ తర్వాత జమ్మికుంట-హుజూరాబాద్ మధ్య బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచి పోతాయి.

● కండక్టర్లు లేక ఇబ్బందులు

జమ్మికుంట-హుజూరాబాద్ పట్టణాల మధ్య ఆర్టీసీ బస్సులకు కండక్టర్లు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. జనంతో బస్సులు ఫుల్ అవుతుండడంతో డ్రైవర్ పట్టణం చివర ఆపి టిక్కెట్లు కొడుతుంటాడు. దీంతో డ్రైవర్లపై అదనపు బారం పడుతుండగా, ప్రయాణికులకు 30 నిమిషాలకు పైగా ఆలస్యం అవుతుంది.

● చివరి బస్సుతో అవస్థలు

హుజూరాబాద్ నుంచి రాత్రి 10.10 గంటలకు చివరి బస్సు ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి ఆలస్యంగా వస్తున్న ప్రయాణికులు జమ్మికుంటకు రావా లంటే ప్రైవేట్ వాహనాలనుఆశ్రయించాల్సిందే. ఇదే అదునుగా ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల వద్ద డబుల్ చార్జీ వసూలు చేస్తుంటారు. ఒక్కోసారి ప్రైవేట్ వాహనాలు లేక రాత్రంతా వేచి ఉండాల్సి వస్తుంది. ఇప్పటికైన ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయా ణికులు కోరుతున్నారు.

● నిలుచునే ప్రయాణం

జమ్మికుంట-హుజూరాబాద్ మధ్య నిత్యం పది బస్సులు రాక పోకలు కొనసాగిస్తాయి. ఎనిమిది ఎక్స్‌ప్రెస్ బస్సులు, రెండు ఆర్డీనరి బస్సులు నడుస్తాయి. ఒక్కో బస్సు రెండు పట్టణాల మధ్య 13 ట్రిప్పుల చొప్పున మొత్తం 130ట్రిప్పులు తిరుగుతాయి. అయినా ప్రయాణి కుల రద్దీతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. బస్సులో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతుంటారు. నిలుచుని ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువ ఉంటుంది. అధిక లోడుతో బస్సుల వేగం తగ్గి గమ్యం చేరేందుకు రెట్టింపు సమయం పడుతోంది.



హుజూరాబాద్ వెళ్లే ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్

ప్రభుత్వానికి డివిజన్ల పునర్విభజన ముసాయిదా

● నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ డివిజన్ల పునర్విభజన ప్రక్రియను పూర్తిచేసి ముసాయిదాను కలెక్టర్ పమేలా సత్పతి ఆమోదంతో ప్రభుత్వానికి పంపించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థను మొత్తం 66 డివిజన్లుగా పునర్విభజన చేసి ముసాయిదాపై నగర ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు తీసుకున్నామన్నారు. అభ్యంతరాలు, సూచనలపై టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో డివిజన్ల వారీగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశామని తెలిపారు. వచ్చిన అభ్యంతరాల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి తుది డ్రాఫ్ట్‌ను కలెక్టర్ ఆమోదానికి పంపించారు. కలెక్టర్ సమ క్షంలో అధికారులతో కలిసి అభ్యంతరాలు, సూచనలపై సుదీర్ఘంగా చర్చించి, పరిశీ లించిన డ్రాఫ్ట్ పూర్తి చేశామని తెలిపారు. అనంతరం డివిజన్ల పునర్విభజన డ్రాఫ్ట్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ఆమోదంతో ప్రభుత్వానికి పంపించామని కమిషనర్ తెలిపారు.

24 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు పదోన్నతులు

కరీంనగర్ క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్లల జోన్‌లో పనిచేస్తున్న 24 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 24 మంది పదోన్నతిపొందిన వారిలో కరీంనగర్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందినవారున్నారు.

సమీకృత మార్కెట్లకు గ్రహణం వీడేదెన్నడో?

- ప్రారంభించినా అందుబాటులోకి రాని పద్మనగర్ మార్కెట్
- అసంపూర్తిగా మరో రెండు మార్కెట్లు
- నత్తనడకన కాశ్మీర్ గడ్డ మార్కెట్

కరీంనగర్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో నాలుగు సమీకృత మార్కెట్ల నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు 10 కోట్ల రూపాయలు కేటాయించింది. నగరం నడిబొడ్డున ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్ రద్దీగా మారింది. అనేక సమస్యలు తలెత్తడంతో ఆ మార్కెట్‌కు అత్యంత సమీపంలోని కలెక్టర్ బంగ్లాకు ఎదురుగా ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని కూల్చి వేసి సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్ఖాన గడ్డను అనుకుని ఉన్న శివారు కాలనీలకు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో మరో మార్కెట్ నిర్మాణం చేపట్టారు. స్మార్ట్‌సిటీ నిధులతో పద్మనగర్‌లో, కాశ్మీర్ గడ్డ రైతు బజారును కూల్చి వేసి ఆ ప్రాంతంలోనే మరో మార్కెట్ నిర్మాణాన్ని ప్రారం భించారు.

● విమర్శలు.. ఫిర్యాదులు

మొట్ట మొదట వ్యవసాయ మార్కెట్, కలెక్టరేట్ బంగ్లా ముందు పనులు మొదలయ్యాయి. పనులు జరుగుతున్న సమయంలోనే అక్రమాలు జరిగాయని, అవినీతి చోటు చేసుకుందని, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని విమర్శలు, ఫిర్యాదులు వెల్లు వెత్తాయి. వాటిపై విచారణ జరుపుతుండగానే స్మార్ట్ సిటీ నిధులతో పద్మనగర్, కాశ్మీర్ గడ్డ మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించారు. దాదాపు 13కోట్ల వ్యయంతో పద్మనగర్ సమీకృత మార్కెట్ పనులను వేగంగా పూర్తి చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే ఈ మార్కెట్ ఆధునిక హంగుల్లో అగ్ర గామిగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. గత జనవరి 28న ప్రస్తుత పాలకవర్గ పదవి కాలం ముగియడంతో అంతకు రెండు, మూడు రోజుల ముందు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆర్భాటంగా మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ రాష్ట్రానికే ఆదర్శమని గొప్పలు చెప్పారు. రేపటి నుంచి మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తామని ఈ ప్రాంత ప్రజలకే కాకుండా కరీంనగర్ ప్రజలందరికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని ప్రకటించారు. 300 మందికి పైగా కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, కిరాణం, తదితర వస్తువులను అమ్ముకునేందుకు వ్యాపారులకు స్థలాలు అందజేశారు. ఇప్పటికీ ఈ మార్కెట్‌లో క్రయ విక్రయాలు ప్రారంభం కాలేదు. 13 కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ భవనం నిరుపయోగంగానే ఉంది. మరో వైపు కాశ్మీర్ గడ్డలో రైతు బజార్‌ను కూల్చి వేసి నిర్మిస్తున్న మార్కెట్ పనులు ఇంకా నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్మాణం పూర్తయిన పద్మనగర్ మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని, మిగతా మార్కెట్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అర్ధంతరంగా నిలిచిపోయిన మదీన కాంప్లెక్స్ సమీపంలోని మార్కెట్ భవన సముదాయం



పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్

'ఊయల'లో చిన్నారి

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఊయలలో బుధవారం గుర్తు తెలి యని వ్యక్తులు ఒక పాపను వదిలి వెళ్లా రని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. పాపకు వెంటనే పిల్లల వైద్యులు పలు పరీక్షలు చేశామని తెలిపారు. పాప ఆరోగ్యంగా ఉంటే డీసీపీ వోకు (బాలల సంరక్షణ అధికారి) అప్పగి స్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి సూచన మేరకు గత నెలలో జిల్లా జన రల్ ఆసుపత్రిలో ఊయలను ఏర్పాటు చేశారు. పిల్లలు వద్దనుకునేవారు, సమ స్యలు ఉన్న పిల్లలను కొందరు వదిలేస్తు న్నారని, అలా చేయకుండా వారిని ఈ ఊయలలో వేసినట్లయితే ప్రభుత్వం వారిని సంరక్షిస్తుందని తెలిపారు. ఊయ లను ఏర్పాటు చేసిన ప్రాంతంలో సిబ్బ ంది నిఘా కానీ సీసీ కెమెరాలు కాని ఉండవు. దీనిపై అన్ని పత్రికలు, ఎలక్ట్రా నిక్ మీడియాలో ప్రచారం చేశారు. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు ఊయలలో మూడు సంవత్సరాల వయ స్సు ఉన్న పాపను వేసి వెళ్లారు. పాపను గుర్తించిన సిబ్బంది వైద్యాధికారులకు సమాచారం అందించగా వారు వెంటనే అక్కడికి చేరుకొని పాపకు పిల్లల వైద్యులచే పరీక్షలు నిర్వహించి పిల్లల వార్డుకు తరలించారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి, ఫిబ్రవరి 2025లో నిర్వహించిన ఎమ్మెస్సీ (కెమెస్ట్రీ) ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

వ్యాను-కారు ఢీ

● ముగ్గురికి గాయాలు

మల్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజి సమీపంలో బుధవారం డీసీఎం వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి మధ్యప్రదేశ్‌కు కొబ్బరి బొండాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్, కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులోని ఇద్దరికి గాయాలు కాగా రహదారి పక్కన నిలుచున్న పెగడపల్లి మండలం నందగిరికి చెందిన మనెమ్మ అనే మహిళకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. ప్రమాదంలో కారు, డీసీఎం వ్యాన్ ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం అనంతరం డీసీఎం వ్యాన్‌ను పోలీసులు ఠాణాకు తరలించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● తప్పిన పెను ప్రమాదం

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఓ ఆర్టీసీ బస్సు టైరు పగిలి అదుపుతప్పిన సంఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ముంజంపల్లి గ్రామశివారులో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భద్రాచలంకు వెళుతోంది. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామశివారుకు రాగానే బస్సు టైరు పగిలింది. దీంతో బస్సు కుడివైపున గల మరో రోడ్డు వైపునకు దూసుకెళ్లి రేయిలింగ్‌కు ఢీకొని ఆగింది. బస్సులో 26 మంది ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఓసీపీ-3లో డీజిల్ బోజర్ బోల్తా

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో డీజిల్ బోజర్ బోల్తాపడింది. బుధవారం ప్రాజెక్టులోని క్వారీ నుంచి సర్ఫేస్‌కు వెళ్లే దారిలో డీజిల్ బోజర్ ఇంజన్ ఫెయిల్ కావడంతో దారిలో నిలిచిపోయింది. సుమారు 3వేల లీటర్ల డీజిల్‌తో ఉన్న బోజర్‌నుపార్కింగ్ స్థలానికి గ్రేడర్‌సహాయంతో తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో బోజర్‌లో డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు ఉన్నారు. ఇద్దరు కార్మికులు వాహనంనుంచి దూకగా, బోజర్‌లో ఉన్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కండీషన్ సరిగాలేని వాహనం కారణంగా ప్రమాదం జరిగినట్లు కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి.

యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక సుధాకర్(28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం మేరకు సుధాకర్ అదే గ్రామానికి చెందిన అపూర్వ అనే యువతిని రెండు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున సుధాకర్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి

● మూతపడే స్థితి నుంచి 30 మంది విద్యార్థులతో కళకళ ● బట్టపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంటింటా ప్రచారం

సారంగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మూతపడే స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి పోసాడు ఓ ఉపాధ్యాయుడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండేవారు. దీంతో విద్యార్థులను పక్క గ్రామంలో గల పాఠశాలకు పంపి బడిని మూసివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో బట్టపల్లి ఉపాధ్యాయుడు సుధాకర్ ఎలాగైనా బడిని బతికించాలని కంకణం కట్టుకున్నాడు. గ్రామంలో విద్యార్థుల ఇంటింటికీ తిరిగి పోషకులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన ఉంటుందని, పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తారని ప్రభుత్వ పరంగా వచ్చే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాడు. దీంతో గ్రామంలోని పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం బట్టపల్లి ప్రభుత్వ పాఠశాల 30 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు అదనంగా మరో టీచర్‌ను కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బట్టపల్లి పాఠశాలలో విద్యార్థులతో పోషకులు, ఉపాధ్యాయుడు

పోషకుల్లో ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కల్పించాం

సుధాకర్, బట్టపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు



ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాం. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని భరోసా ఇచ్చాం. ప్రభుత్వ బడుల్లో చదివితే విద్యార్థులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో అవగాహన కల్పించాం. దీంతో 30 మంది విద్యార్థులను పాఠశాలకు పంపిస్తున్నారు.

నా ఇద్దరు పిల్లలను చేర్పించా

అర్రె ప్రేమానందం, పోషకుడు, బట్టపల్లి గ్రామం



నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నా. మా గ్రామంలో అందరూ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతో ఊరిలోని ప్రభుత్వ పాఠశాల మూత పడే పరిస్థితి వచ్చింది. దీంతో ఎలాగైనా పాఠశాలను బతికించాలని గ్రామంలోని తల్లిదండ్రులం సమష్టి నిర్ణయంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం.

ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న పోడు రైతులు

● వెనుదిరిగిన అటవీశాఖ అధికారులు

వీర్నపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు ప్లాంటేషన్ కోసం సర్వేచేయడం సరికాదని పోడురైతులు మండిపడ్డారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 20సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడుభూముల్లో మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు బుధవారం సర్వేచేపట్టారు. విషయం తెలుసుకున్న అన్నికులాల రైతులు అక్కడికి చేరుకొని మొక్కలు నాటొద్దని అధికారులను వేడుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2005సంవత్సరం తర్వాత ఆక్రమణకు గురైన అటవీభూమిలో ప్లాంటేషన్ కోసం సర్వే చేస్తున్నామని అటవీశాఖ సెక్షన్ అధికారి పద్మలత రైతులకు వివరించారు. పోడుపట్టాల కోసం ప్రభుత్వాలను వేడుకుంటున్నామని ఏళ్లక్రితం సాగుచేసిన భూములను అధికారులు సర్వే చేయ డం సరికాదన్నారు. అధికారులు సర్వేను ఆపకపోతే పురుగుల మందు తాగే పరిస్థితి వస్తుందని రైతులు పేర్కొన్నారు. అక్కడి నుంచి రైతులను పంపించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నించినా వినకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.



సర్వేను అడ్డుకుంటున్న పోడు రైతులు

గౌరెడ్డిపేటలో దొంగల బీభత్సం

● మంగళసూత్రం ఎత్తుకెళ్లిన దుండగులు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్

పెద్దపల్లి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానికులు, పెద్దపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన సొన్నాయి టంకం లక్ష్మీ రాత్రి నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మెడలోఉన్న 20గ్రాముల మంగళసూత్రం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లినట్లు తెలుపుతున్నారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ చేరుకుని డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేయించారు. సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన యువతి(22) మంగళవారం అదృశ్యం అయ్యింది. యువతి తనఇంటి నుంచి మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. యువతి తండ్రి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు బుధవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో పాత పగలు మనసులో పెట్టుకుని ప్రవీణ్ అనే యువకుడిపై పురుషోత్తం అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పురుషోత్తంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణపోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్‌తీగలకు తగిలి కిందపడిన నెమలి

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీపరిధిలోని లక్ష్మీపూర్‌లో జాతీయపక్షి నెమలి బుధవారం ఇళ్లలోకి వచ్చి విద్యుత్ తీగలకు తగిలి కిందపడిపోయింది. అస్వస్థతకు గురవడంతో గమనించిన స్థానికులు నెమలిని చేరదీసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

ఫిట్‌నెస్‌లేని బస్సు సీజ్

తిమ్మాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ఓవిద్యాసంస్థ బస్సును బుధవారం నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. విద్యాసంస్థలు ప్రారంభం అయినప్పటికీ కొన్నివిద్యాసంస్థలు బస్సులను ఇంకా ఫిట్‌నెస్ చేసుకోలేదన్నారు. వాటిపై ప్రత్యేక తనిఖీలుచేపట్టి సంబంధితవిద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

శంకరపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో ఓవ్యక్తి మద్యానికి బానిసై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి వీరస్వామి(45) కొన్ని సంవత్సరాల నుంచి తాగుడుకు బానిసయ్యాడు. ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చేవాడు. రోజూ లాగానే బుధవారం కూడా తాగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కూతురు ఇంట్లోకి వెళ్లి చూడగా తండ్రి ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె అరుస్తూ చుట్టు పక్కల వాళ్లను పిలిచి కిందకు దించగా అప్పటికే వీరస్వామి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవపరీక్షకోసం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల మొగిలయ్య(78) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాళ్ల నొప్పులు భరించలేక ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టుకు చెందిన కదురుక గంగరాజం(59) అనేవ్యక్తి బుధవారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. కొండగట్టుకుచెందిన కదురుక గంగరాజం కొంత కాలంగా కాళ్లకు తీవ్రబొబ్బలు వచ్చి నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో నొప్పిభరించలేక బుధవారం మధ్యాహ్నం ఘాట్‌రోడ్డు మధ్యల గుట్ట సమీపంలో క్రిమిసంహారక మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులుగమనించి 108లో చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నకిరేకల్‌కి చెందిన శివరాత్రి సైదులు హుజూరాబాద్‌లో బావులు తవ్వుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంట్లో కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో విరక్తి చెందిన సైదులు బోర్నపల్లి కాకతీయకాలువలో దూకాడు. కాలువలో నీరు లేకపోవడంతో ప్రాణా పాయం తప్పింది. గమనించిన స్థానికులు, అగ్నిమాపకసిబ్బంది సైదులును కాలువలోనుంచి బయటకుతీసి 108లో హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అరుణ్‌కుమార్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో ఈనెల10న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుగ్గిళ్ల అరుణ్‌కుమార్(22) అనేయువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల బాలరాజు చిన్నకుమారుడు అరుణ్‌కుమార్‌తోపాటు మరో యువకుడు రాజు సిరిసిల్ల నుంచి వేములవాడకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రగుడు శివారులో కారుఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన అరుణ్‌కుమార్ హైదరాబాద్‌లో వారంరోజులుగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

గంగాధర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన వృద్ధుడు చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం.. గ్రామానికిచెందిన రేండ్ల రామస్వామి(74) కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పి, మోకాళ్లనొప్పులతో బాధపడుతున్నాడు. ఎన్నిఆస్పత్రుల్లో చూపించినా ఉపశమనం లేకపోవ డంతో తీవ్రమనస్తాపానికిగురై జీవితంపై విరక్తితో ఈనెల16న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఈనెల17న మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి

● ఇచ్చిన హామీలు అమలుచేసే శక్తినివ్వాలని కోరా



శ్రీవారి ఆలయం ఆవరణలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తదితరులు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసే శక్తినివ్వాలని శ్రీవారిని కోరుకున్నట్టు మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయ న దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర క్యాబినేట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. ఆరు గ్యారెంటీల పథకాలకు శ్రీవారు, అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రిగా తనకు ధైర్యాన్ని, ఆశీర్వాదాన్ని ప్రసాదించాలని కోరుకున్నట్టు చెప్పారు. సామాన్య పార్టీ కార్యకర్తగా ఉండే తనకు మంత్రిగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.

ఝాన్సీలక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం అని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీకౌన్సిలర్ ఏసీఎస్ రాజు అన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ యుద్ధసమయంలో ఝాన్సీలక్ష్మీబాయి చూపిన తెగువ, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో సంఘబాధ్యులు అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, నారెందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, వేముల పోచమల్లు, ఎడ్మల వెంకటరెడ్డి, మల్లికార్జున్, రాజేశ్వర్‌రావు, విఠల్, బాలన్న, రాపర్తి రవి, వీరన్న, భూమన్న, శ్రీనివాస్, అంజన్న, గంగాధర్, రామచంద్రం, నరేందర్, అశోక్ తదితరులున్నారు.

కారు బీభత్సం..

● ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి కారణమైన కారు



పండరీనాథ్(ఫైల్)

వేములవాడ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కారు బీభత్సం సృష్టించడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల వేములవాడ మండలం రుద్రవరం, ఆరెపల్లి గ్రామాల్లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ కారు(టీఎస్08 జీజే8526)లో వేములవాడ నుంచి మద్యం సేవించి అతివేగంగా కరీంనగర్ వైపు వెళుతూ రుద్రవరం గ్రామ సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న దర్శి(35) అనే కార్మికుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ఆగకుండా అదే అతివేగంతో వెళ్లి పక్కనున్న ఆరెపల్లి గ్రామంలో ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి వస్తున్న వేములవాడ పట్టణానికి మల్యాల పండరీనాథ్(72), అతడి మిత్రుడు చందులను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పండరీనాథ్ అక్కడికక్కడే మృతిచెందగా, చందు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఒకరు పరారీలో ఉండగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన జరిగిన తీరును పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుల్లో దర్శి స్థానిక ఇటుక బట్టీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. దర్శి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు అని స్థానికులు చెబుతున్నారు.

133.8 కిలోల గంజాయిని దహనం చేసిన పోలీసులు



పట్టుకున్న గంజాయిని సీపీ గౌస్ ఆలం సమక్షంలో ఇన్సునేటర్‌లో దహనం చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన 133.8 కిలోల నిషేధిత గంజాయిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డ్రగ్‌డిస్పోజల్ కమిటీ సమక్షంలో బుధవారం దహనం చేశారు. మానకొండూర్ మండలం ఈదుల గట్టెపల్లిలోని వెంకటరమణ ఇన్సునేటర్‌లో నిబంధనల మేరకు దహనం చేసినట్లు అధికారుల తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు వేణుగోపాల్, విజయ్ కుమార్, సీఐలు పుల్లయ్య, సంజీవ్, రజనీకాంత్, ఇన్సినేటర్ ప్లాంట్‌కు చెందిన ప్రతినిధి తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోని బంగారం చోరీ

మంథనిరూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ చేశాడు. ధర్మారం గ్రామంలో కందుకూరి లక్ష్మి అనే వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున సుమారు 3గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న రెండున్న తులాల బంగారం తాడును ఎత్తుకెళ్లాడు. లక్ష్మి భర్త, కుమారులు మరణించారు. పోలీసులకు సమాచారం అందించగా గ్రామంలో విచారణ చేపట్టారు.

గంజాయి పట్టివేత



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద కిలో 180 గ్రాముల గంజాయిని బుధవారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికిచెందిన కొంటు అనిల్‌కుమార్, సుభాష్‌నగర్‌కుచెందిన నీర్ల వంశీకృష్ణ వద్ద గంజాయి పట్టుబడిందని, వారిద్దరిని అరెస్టుచేశామని పేర్కొన్నారు. నిందితులు ఇద్దరుకొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డారని, ఎలాగైనా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకొస్తుండగా కరీంనగర్ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఎస్సైలు రాజన్న, శేఖర్, భాస్కర్‌రెడ్డి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం తీగలగుట్టపల్లి వద్ద బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్ యజమాని కోండ్ర కృష్ణపై కేసునమోదు చేసినట్లు, కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కొత్తపల్లిమండలం చింతకుంటవద్ద అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఒకట్రాక్టర్‌ను కొత్తపల్లిపోలీసులు బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌డ్రైవర్‌పై కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మానకొండూర్‌లో నాలుగు ట్రాక్టర్ల పట్టివేత

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి మానకొండూర్ గ్రామశివారులో పట్టుకొని ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐతెలిపారు.

ఎస్సారార్‌లో కొత్తగా బీకామ్ రిటైల్ ఆపరేషన్స్ డిగ్రీ కోర్సు


గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) 2025-26 విద్యాసంవత్సరం నుంచి బీకామ్ రిటైల్ ఆపరేషన్స్ అనే కొత్త డిగ్రీ కోర్సు పెట్టనున్నారు. దోస్త్ రెండో విడతలో అనుమతి లభించినట్లు, 60 సీట్లతో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా కోర్సు రూపొందించినట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఏ గ్రూపు చదివినా కోర్సుకు అర్హులని తెలిపారు. కోర్సుతో విద్యార్థులకు రిటైల్ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. వివరాలకు 98665714 41, 9959838049, 8341858459నంబర్లలోగానీ, కళాశాల దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ-సీఎస్ఏటీ-2025 (సివిల్ సర్వీసెస్ పరీక్ష) కోసం ఉచిత శిక్షణకు దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శాఖ ఎస్సీ స్టడీ సర్కిల్, డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. బంజారాహిల్స్ హైదరాబాద్‌లో శిక్షణతో భోజన వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. http://tsstudy-circle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-23546552, 8121626423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చదువుదాం.. చదివిద్దాం..



నేడు జాతీయ పఠనా దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శరీరానికి వ్యాయామం ఎలా అవసరమో మనసుకు చదవడం కూడా అంతేనని ఆంగ్ల వ్యాసకర్త, కవి, నాటక రచయిత జోసెఫ్ అడిసన్ అన్నారు. చదవడం వల్ల మెదడు సామర్థ్యం, పనితీరు మెరుగుపడుతుంది. ఈ దిశలో ఇంటర్‌నెట్ ఆధిపత్యం ఉన్న కాలంలో కూడా ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించడానికి, అక్షరాస్యత, పుస్తకాల ప్రాధాన్యం గురించి అవగాహన పెంచడానికి ప్రతీ సంవత్సరం జూన్ 19న జాతీయ పఠన దినోత్సవాన్ని జరుపుకుంటారు. పఠన దినోత్సవం తర్వాత వారం పఠన వారంగా జరుపుకుంటారు.

పఠన దినోత్సవం పుట్టిందిలా..

కేరళలో గ్రంథాలయ, అక్షరాస్యతా ఉద్యమ పితామహుడు పుతువాయిల్ నారాయణ పనికర్ (ఉపాధ్యా యుడు) గౌరవార్థం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. దేశంలో అక్షరాస్యత, విద్యను ప్రోత్సహించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. వ్యక్తులు, సమాజం పురోగతిని, అభివృద్ధిని సాధించాలంటే పుస్తకాల ద్వారా విద్యను పొందడం చాలా అవసరమని విశ్వసించారు. 1945 లో కేరళలో తొలి ప్రజా గ్రంథాలయాన్ని స్థాపించారు.

చదవడం వల్ల ప్రయోజనాలు

చదవడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడుతాయి. కొత్త సమాచారం కొత్త జ్ఞాపకాలను సృష్టిస్తుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. రచనల పఠన, లిఖనం అలవాటు పెంచుతుంది. స్పష్టంగా సంభాషించవచ్చు. 30 నిముషాలు చదవడంతో హృదయస్పందన రేటు, రక్తపోటు, మానసిక క్షోభ భావనలు తగ్గుతాయి, నిరాశ, మానసిక రుగ్మతలు నశిస్తాయి. చరిత్ర, సైన్స్, సాహిత్యం వంటి విస్తృత శ్రేణి అంశాలపై సమాచారం లభిస్తుంది. వివిధ విషయాలను అన్వేషించడానికి, ప్రపంచం గురించి లోతైన అవగాహన పొందడానికి వీలు కలుగుతుంది.

గ్రంథాలయాల పాత్ర కీలకం..

చదవులో మన ఇంట్లో ఉన్న పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలతో పాటు గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రంథాలయాల్లో మనకు కావాల్సిన పుస్తకాలు లభిస్తాయి. అక్కడే కాకుండా ఇంటికి పుస్తకాలు తెచ్చుకుని, నచ్చిన అంశాలు, సమాచారాన్ని నోట్ చేసుకొని తిరిగి ఇవ్వవచ్చు.



చదువుతో విజ్ఞానం.. వికాసం
సత్తు మల్లేశం, గ్రంథాలయ సంస్థ చైర్మన్



చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో ఎప్పటికప్పుడు వివిధ రకాల కొత్త పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు తెప్పిస్తున్నాం. వసతులను మెరుగుపరిచే దిశలో ఉన్నాం. పాఠకుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

రోజు కొంతసేపైనా చదువుతా..
అన్నవరం దేవేందర్, కవి, రచయిత



రోజూ కొంతసేపైనా చదవనిదే నాకు పాలు పోదు. రచయితలు ఇతర రచనలు చదివితేనే వారి సృజనాత్మకత, రచనాశక్తికి పదును పెట్టవచ్చు. పిల్లల నుంచి పెద్దవారి వరకు ఎంతో కొంత సేపు చదవడం నిత్య కృత్యం చేసుకోవాలి.

మానసిక ప్రశాంతత లభిస్తుంది
శ్రీవత్స, విద్యార్థి



నా పాఠ్య పుస్తకాలతో పాటు దిన పత్రిక, ఇతర కథలు, సైన్స్ పుస్తకాలు రోజూ చదువుతాను. ఇలా కొంత సేపైనా చదవడంతో సెల్ ఫోన్, టీవికి దూరంగా ఉండగలుగుతున్నాను. మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుంది.

ముల్కనూర్ బ్యాంకు ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ ఏకగ్రీవం

ధ్రువీకరణ పత్రాన్ని అందించిన ఎన్నికల అధికారి



ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లు

భీమదేవరపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ప్యానల్‌కు సంబంధించి ఐదుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు. ఒకటో వార్డు నుంచి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రెండో వార్డు నుంచి బొల్లంపల్లి కుమారస్వామి, ఐదో వార్డు నుంచి జి శ్రీనివాస్, తొమ్మిదో వార్డు నుంచి గుర్రాల భాస్కర్‌రెడ్డి, 15వ వార్డు నుంచి కాశిరెడ్డి వసంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి కోదండరాములు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశీవిశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, ఎన్నికల సహాయ అధికారి రవీంద్ర, లోన్ సెక్షన్ మేనేజర్ జి రాజమౌళి, వెంకటేశ్వర్‌రావు, సతీష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే ఏకగ్రీవ ఎన్నిక
అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్

ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో నా ప్యానల్‌కు చెందిన ఐదుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా గెలిపించినందుకు రైతులకు కృతజ్ఞతలు. ఏకగ్రీవ ఎన్నిక కు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు. రైతుల సంక్షేమం, వారికి సకాలంలో రుణాలు ఇస్తాము. ముల్కనూర్ బ్యాంకు సభ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా.



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ప్రవీణ్‌రెడ్డి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ సంఘాల మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదింపజేయడం హర్షణీయం అయినప్పటికీ ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదింప జేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లు ఆమోదించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తిరుపురం రామచంద్రం, రాచకొండ రోజా ఎలుక బగవాన్, దండుగుల హృషికేష్, అనుమల్ల సంజయ్ స్మామ్రాట్, పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎం ఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఎంఫార్మసీ, ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను బుధవారం యూని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

డంప్ యార్డు తరలించాలని నిరసన



ఇంటింటికీ పోస్టర్ అంటిస్తూ నిరసన తెలుపుతున్న కాలనీ మహిళలు

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని డంప్‌యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ అలకాపురి కాలనీ మహిళలు బుధవారం 'ఓటు కాదు.. మాకు ఊపిరి కావాలి' అనే పోస్టర్లను ఇళ్లకు అంటించి వినూత్న నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంప్ యార్డు పొగతో ఇబ్బందులు పడుతున్నామని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నామని, ఆసుపత్రుల పాలవుతున్నామని వాపోయారు. డంప్ యార్డును తరలించాలని ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తులు చేశామని, హామీగానీ, చర్యలు గానీ లేవన్నారు. రానున్న ఎన్నికల్లో తాము ఓటు హక్కును వినియోగించు కోవద్దని నిర్ణయించుకున్నామని తెలిపారు. డంప్‌యార్డును తరలిపు హామీ ఇవ్వాలన్నారు. మునిపల్లి పణీత, సరళ, భాగ్యలక్ష్మి, శోభ, శ్యామల, సుమతి, అన్నపూర్ణ, శ్రీలత, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



పూసాలలో బోనాలతో మహిళలు

సుల్తానాబాద్, జూన్ 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలలో బుధవారం ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆదే విధంగా పోచమ్మ తల్లికి కూడా బోనాలు సమర్పించారు. పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గుర్రాల మల్లేశం ఆధ్వర్యంలలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే బోనాల వేడుకలలో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించినట్లు మల్లేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్, కార్యదర్శి కంకనాల సతీష్, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, సొసైటీ డైరక్టర్లు లక్ష్మయ్య, కనకయ్య, భూతగడ్డ కనుకయ్య, లక్ష్మీనారాయణ, రవి,శ్రీను, కంకణాల అశాలు, ఉస్నెం రవి, సిద్ధ తిరుపతి గుర్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● **కమాన్‌పూర్** : మండలంలోని జూలపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి బోనాలు బుధవారం అంగరంగ వైభవంగా ముదిరాజ్ కులస్థులు నిర్వహించారు. ప్రతి వర్షాకాలం ముందు గ్రామంలో డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి బోనాలు సమర్పిస్తారు. ఈ యేడు వర్షాలు సంమృద్ధిగా కురిసి పాడి, పంటలు పండాలని అమ్మవారికి మెక్కులు చెల్లించుకున్నారు.



జూలపల్లిలో బోనాలతో గీత కార్మికులు

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వేళాయె



● రాష్ట్ర వ్యాప్తంగా 8 యూనివర్సిటీల్లో దరఖాస్తుకు షెడ్యుల్ విడుదల ● జూలై 17 వరకు తుదిగడువు

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రఖ్యాత ఎనిమిది యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 (టీజీపీసీజీఈటీ-2025)గా పిలుస్తారు. జూన్ 18 నుంచి జూలై 17 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులందరూ తమకు ఇష్టమైన సబ్జెక్టుల్లో పీజీ కోర్సులను అభ్యసించవచ్చు.

మీ కోసం...

ఎనిమిది వర్సిటీలకు ఒకే దరఖాస్తు

రాష్ట్రంలోని అన్ని ప్రధాన వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించేందుకు ఉస్మానియా వర్సిటీయే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. గతంలో ఏ వర్సిటీకి ఆ వర్సిటీ ప్రవేశ పరీక్షను నిర్వహించేవారు. కొన్నేళ్లుగా ఉస్మానియా వర్సిటీ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, వరంగల్ కాకతీయ, నిజామాబాద్ తెలంగాణ, నల్లగొండ మహాత్మాగాంధీ, మహబూబ్నగర్‌లోని పాలమూరు, కరీంనగర్ శాతవాహన, హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలకు కామన్ ఎంట్రెన్స్ టెస్టు నిర్వహిస్తారు.

కోర్సుల వివరాలు

పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, అరబీ, ఇస్లామిక్ స్టడీస్, ఉర్దూ, రాజనీతిశాస్త్రం, ఎకానమిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, సోషియాలజీ, ఎంఎస్‌ఐఎస్సీ, ఎంకామ్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్ బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంఈడీతో పాటు ఇతర పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. వీటితోపాటు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన ఎంఎస్సీ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంబీఏతో పాటు ఇతర కోర్సులు ఉన్నాయి.

కంప్యూటర్ పరీక్ష

కంప్యూటర్ బేస్డ్ పరీక్ష (సీబీటీ) నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల్లో డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నాలు ఉంటాయి. మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అపరాధ రుసుంతో గడువు

జూలై 24 వరకు రూ.500 అపరాధ రుసుము తోనూ, జూలై 28వ తేదీ వరకు రూ.2వేల అపరాధ రుసుముతోనూ దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. జూన్ 24 వరకు గడువు విధించారు.

దరఖాస్తుకు వెబ్‌సైట్‌లు

https://www.osmania.ac.in/cpget.tsche.ac.in 2025లో దరఖాస్తులు సమర్పించాలి. నిర్ణీత ఫీజులను చెల్లించాలి. హాల్ టికెట్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. కోర్సులు, ఫీజులు, హాస్టల్ వసతితోపాటు సమగ్ర వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.





వెండిపతకం సాధించిన కూనకిషన్

జాతీయ అర్చరీలో ఆర్టీసీ ఉద్యోగికి వెండిపతకం

భగత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో ఆర్టీసీ జోనల్ వర్క్ షాప్ కరీంనగర్ ఉద్యోగి కూన కిషన్ వెండి పతకం సాధించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన అర్చరీ జాతీయ స్థాయి పోటీల్లో 50 మీటర్లలో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా కిషన్‌ను ఆర్టీసీ వర్క్ షాపు వర్క్ మేనేజర్ ప్రణీత్, అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, సురేందర్, ఎంఎఫ్ నందు, సూపర్‌వైజర్స్ అభినందించారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో జ్యేష్ఠాభిషేకం

108 కళశాలతో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మల్యాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం జ్యేష్ఠాభిషేకాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వ హించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 108 కళశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు తదితరులు ఉన్నారు.

సంతలో ట్రాఫిక్ చింత

వెల్గటూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, వివిధ రకాల వస్తువులు, బట్టలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. ఇరువైపులా చిరు వ్యాపారులు కొట్లు ఏర్పాటు చేసుకోవడంతో రోడ్డు కొంత ఇరుకుగా మారుతోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనితో కూరగాయలు తదితరాలు కొనుక్కోవడానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత రోజు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా పోలీస్ సిబ్బందిని నియమించాలని ప్రజలు, వాహనదారులు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.



వెల్గటూర్ సంతలో ట్రాఫిక్ ఇబ్బందులు

ఎంఈవో భవనం పూర్తయ్యేదెన్నడో?

- అసంపూర్తిగా పనులు
- ప్రాథమికోన్నత పాఠశాలలో కార్యాలయం నిర్వహణ

కరీంనగర్‌రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఎంఈవో కార్యాలయం పనులకు మోక్షం లభించడం లేదు. నిధులు చాలక కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో కార్యాలయం ప్రారంభానికి నోచుకోక ఐదేళ్లు గడుస్తున్నాయి. ప్రస్తుతం కార్యాలయాన్ని కరీంనగర్ గోదాంగడ్డ ప్రాంతంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కరీంనగర్, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల ఎంఈవో కార్యాలయాలు ఒకే చోట ఉండేవి. ఇటీవల కరీంనగర్ రూరల్ మండల కార్యాలయాన్ని మార్చారు.


దుర్శేడ్‌లో నిలిచిన ఎంఈవో భవన నిర్మాణ పనులు

మండలాల పునర్విభజనలో భాగంగా 2017లో కరీంనగర్ రూరల్ మండలం ఏర్పాటు చేశారు. కరీంనగర్ రూరల్, ఇల్లందకుంట, గన్నేరువరం మండలాల్లో ఒక్కో ఎంఈవో కార్యాలయ భవన నిర్మాణానికి సీఎస్‌డీఎస్‌సీ నిధులు 30 లక్షల చొప్పున కేటాయించారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఎంఈవో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అర్ధంతరంగా పనులు నిలిచిపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని, పనులు పూర్తి చేసి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం
- రవీందర్, ఎంఈవో

నిధులు సరిపోక కరీంనగర్ రూరల్ ఎంఈవో కార్యాలయ నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేశారు. భవన నిర్మాణంపై గతంలోనే డీఈవోకు విన్నవించాం. ప్రస్తుతం గోదాంగడ్డలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కార్యాలయం నిర్వహిస్తున్నాం. నిలిచిన భవన నిర్మాణ పనులు చేపట్టేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ఆర్టీసీ బాదుడు

(5వ పేజీ తరువాయి)

పెంచడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● పెరిగిన బస్‌పాస్ చార్జీలు

చార్జీలను పెంచడమే కాకుండా విద్యార్థుల బస్‌పాస్‌చార్జీలను పెంచుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్ణయంతీసుకున్నది. విద్యార్థులు బస్‌పాస్ చార్జీలను ఒక్కసారిగా 20 శాతం పెంచడంతో విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు.

దీనికి తోడు మూడు నెలల పాస్‌లకు 5 కిలో మీటర్ల వరకు 400 నుంచి 600 రూపాయలకు పెంచారు. పాస్ పాస్‌లలో టోల్ ప్లాజాలు ఉన్న రూట్లలో నెలకు 500 రూపాయల చొప్పున అధికంగా వసూలు చేస్తున్నారు.

జిల్లాలో నెలవారీ రూట్ పాస్‌లు

కిలోమీటర్లు	పాతచార్జి	కొత్తచార్జి
5	150	225
10	250	375
15	300	450
20	400	600
25	450	675
30	500	750
35	550	825

● న్యూస్‌బాక్స్

ఎస్సై బాధ్యతల స్వీకరణ

శంకరపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం ఎస్సైగా శేఖర్‌రెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జమ్మికుంట ఎస్సైగా విధులు నిర్వర్తించిన శేఖర్‌రెడ్డి సాధారణ బదిలీలో భాగంగా కేశవపట్నం ఎస్సైగా విధుల్లో చేరారు.

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7450 పలికింది. బుధవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 67క్వింటాళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7450, కనిష్ఠ ధర రూ.7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో దూరవిద్యలో బీఏ, బికాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 13వ తేదీ వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి కోరారు. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముద్ర లోన్స్, సుకన్య సమృద్ధి ఉజ్వల పథకం, అమ్మనిధి తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

శివాలయంలో బోరు ఏర్పాటు

కరీంనగర్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 7వ డివిజన్ పరిధిలోని సదాశివపల్లి శివాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అందించిన కేంద్ర నిధులతో బుధవారం బోర్ ఏర్పాటు చేయించారు. బీజేపీ నాయకుడు తోట సాగర్ మంత్రికి విన్నవించగా నిధులు కేటాయించారు.

అల్ఫోర్స్ డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు



అభినందిస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు హార్విన్ టెక్నాలజీస్‌లోఉద్యోగాలు సాధించారు. బుధవారం కళాశాల ఆవరణలో కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ విద్యాబోధనతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన భాషా ప్రావీణ్యం, అర్థమెటిక్ రీజనింగ్ వర్బల్ ఎబిలిటి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వివేక్, రామకృష్ణ, వైష్ణవి, కళాశాల ప్రిన్సిపాల్, టీపీవో, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయండి

కరీంనగర్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయడమే ప్రధాన ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అజ్మీర రాజ్ నాయక్, గడ్డి పద్మావతి అన్నారు. బుధవారం నగరంలోని పార్టీ పార్లమెంట్ కార్యాలయాన్ని సందర్శించారు. పార్లమెంట్ కన్వీనర్, పరిశీలకులతో పార్టీ సంస్థాగత నిర్మాణం, వార్డు, గ్రామ, మండల, పట్టణ కమిటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడహక్ కమిటీ కన్వీనర్ వంచ శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సత్యం, ఆగయ్య, శేఖర్‌గౌడ్, ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ అజ్మీర ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్


మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సత్తు మల్లేశం

కరీంనగర్ అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ వెంకటస్వామికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మార్కెట్‌లోకి టాటా అల్ట్రోజ్ కారు


టాటా అల్ట్రోజ్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న జీఎం, సిబ్బంది

కరీంనగర్ అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోతిరాంపూర్ టాటా సెలక్ట్ షోరూంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన కొత్త టాటా అల్ట్రోజ్ కారును బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం జనరల్ మేనేజర్ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ రూ.6.89 లక్షల షోరూం ధరతో ప్రారంభమయ్యే ఈ టాటా అల్ట్రోజ్ కారు అత్యాధునిక, అద్భుతమైన బిల్ట్ క్వాలిటీతో మార్కెట్‌లోకి విడుదలైనట్లు చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం

జమ్మికుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. 18మంది సభ్యులకు 12మంది హాజరయ్యారు. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం ఏజెండాలో పొందుపరిచిన ఆరు అంశాలను పాలకవర్గం ముందు ప్రవేశపెట్టారు. సభ్యులు చర్చించి అన్ని అంశాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో 12మంది డైరెక్టర్లు, మార్కెట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్సారార్ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్ ఐదు యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ రేపటి తరానికి స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, అటానమస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లేడులో బుధవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో 123దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

రామడుగు: మండలంలోని దేశరాజుపల్లిలో రైతుల నుంచి 217 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం మడిపల్లిలో భూ సమస్యలపై 341మంది తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్, రాజాపల్లి, తోకలపల్లి, కుర్మపల్లిలో 692 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ కనుకయ్య తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో పొన్నం రవిచంద్ర పూజలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో చైర్మన్ అనిల్‌కుమార్ ఆహ్వానం మేరకు ఇటీవల గద్దర్ అవార్డు పొందిన పొన్నం రవిచంద్ర దంపతులు బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం రవిచంద్ర మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఆలయానికి సరిపడా గ్రానైట్‌ను సమకూరుస్తానన్నారు. ధర్మకర్తలు సత్యనారాయణ, శ్రీనివాస్, కవిత, కృష్ణ, ఈవో కాంతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ (ఐటీవో)లో పారమిత విద్యార్థులుప్రతిభ చాటారు. గణితంలో కె.అగస్త్య, జి.అరుష్, సాయిరిశిత్ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనూకర్‌రావు, రాకేష్; వీయూఎం ప్రసాద్, వినోద్‌రావు, టీఎస్‌వీ రమణ, హన్మంతరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, కో-ఆర్డినేటర్‌లు రాము, నాగరాజు, గణిత, ఉపాధ్యాయులు వీరలక్ష్మి, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్‌లు

కూలీల సంఖ్య పెంచాలి

శంకరపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ అసిస్టెంట్లు క్లస్టర్ల వారీగా కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్డీవో శ్రీధర్ ఆదేశించారు. శంకరపట్నం మండలం ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో ఉపాధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లేబర్ టర్న్ అవుట్‌తోపాటు సగటు వేతనాన్ని పెంచాలన్నారు. ఫోర్‌టైసెవెన్ నర్సరీలను ఒకటి రెండు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో గోల్కొండ కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో శారద, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు సన్మానం


కేశవరెడ్డిని సన్మానిస్తున్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై మోటివేషన్ చేసినందుకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డిని బుధవారం వయోవృద్ధులు, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెండ్యాల కేశవరెడ్డి తహసీల్దార్‌గా పదవీ విరమణ పొంది సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారన్నారు.

సంక్షిప్తంగా..

సుభాష్‌నగర్: గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి గాలికి వదిలేసిందని, అర్హులైన నిరుపేదలకు ఆ ఇళ్లను ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గంగాధర: గంగాధర మండలం కురిక్యాలకు చెందిన రైతు ఒగ్గరి ప్రశాంత్ కుటుంబానికి ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వెంకటేశ్ ప్రమాద బీమా చెక్కును బుధవారం అందజేశారు. మృతుడికి ఎస్‌బీఐలో జనరల్ ఇన్సూరెన్స్ ఉండగా రూ.20లక్షల ప్రమాదబీమా మంజూరైంది.

కరీంనగర్ టౌన్: నవంబరు 2024లో కులగణన నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని, డ్యూటీ సర్టిఫికెట్స్ అందించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా మంజూర్ అలీ, చింతపల్లి అశోక్ కోరారు. బుధవారం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంఈవో రాములు విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.

చొప్పదండి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని, లేనిపక్షంలో మంత్రులను అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. చొప్పదండిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

సుభాష్‌నగర్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామారావు కోరారు.

తిమ్మాపూర్: అలుగునూర్ పంచముఖ అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం కన్నులపండువగా నిర్వహించారు.

రామడుగు: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో దేశరాజుపల్లి రైతువేదికలో అఖిల భారత మొక్కజొన్న సమన్వయ పరిశోధనకేంద్రం సౌజన్యంతో రైతులకు పంట సాగులో కలుపు మందులను పంపిణీ చేశారు.

● జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి అంజనేయులుగౌడ్‌ను మండలంలోని చిప్పకుర్తిలో గద్దర్ ఫిల్మ్ అవార్డు గ్రహీత, కరీంనగర్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిచంద్ర పరామర్శించారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

వీణవంక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో నాలుగోతరగతిలో ప్రవేశాలకు మండలస్థాయి ఎంపిక పోటీలను మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో శోభారాణి బుధవారం ప్రారంభించారు. పోటీల్లో నలుగురు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి 23, 24తేదీల్లో జిల్లా కేంద్రంలో పోటీలు ఉంటాయని తెలిపారు.

గంగాధర: గంగాధర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ఆరుగురు బాలురు, ఇద్దరు బాలికలు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఇద్దరు ఎంపికైనట్లు ఎంఈవో రాములు తెలిపారు.

ఎమ్మెల్యే పదవికి కౌశిక్‌రెడ్డి అనర్హుడు


ఆలయ వార్షికోత్సవానికి హాజరైన ప్రణవ్‌బాబు

జమ్మికుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పదవికి పాడి కౌశిక్‌రెడ్డి అనర్హుడని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ 33వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని కౌశిక్‌రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నాడన్నారు. అనేక సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్తోందని, దీంతో బీఆర్ఎస్ నేతలు ఫస్ట్రేషన్‌కు లోనవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశిని కోటి, సుంకరి రమేష్, ఎర్రం సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండువగా బీరన్న కల్యాణం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్‌లో బుధవారం రాత్రి బీరన్న కమరతి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ ప్రత్యేక పూజలు చేశారు. బీరన్న నామస్మరణతో గ్రామం మారుమోగింది.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కరీంనగర్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో రవీందర్ హెచ్చరించారు. బుధవారం కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని భవిత కేంద్రంలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు దేవేందర్, గీత, ఐఆర్‌టీ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

కరీంనగర్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దోబీవాడ మడేలేశ్వర స్వామి దేవాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం 50వ డివిజన్ పరిధిలోని పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సబిత అక్షరాభ్యాసం చేయించారు. గణ యూత్ క్లబ్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు దుద్దెల ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనలో యువత పాత్ర కీలకం

తిమ్మాపూర్/ఇల్లందకుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనలో యువత పాత్ర కీలకం అని ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఇల్లందకుంట ఏఎస్ఐ మల్లయ్య అన్నారు. బుధవారం తిమ్మాపూర్‌లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాల, ఇల్లందకుంట జడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.

వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

చొప్పదండి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 26 వైద్యకళాశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. సరైన వసతులు లేవని, మౌలిక సదుపాయాలు కొరత ఉందని పేర్కొన్నారు.

సీనియర్ సర్జన్ డాక్టర్ రవీందర్‌రావు మృతి



సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జనరల్ సర్జన్, ప్రతిమ మెడికల్ కాలేజ్ డీఎంఈ డాక్టర్ రవీందర్‌రావు (75) బుధవారం రాత్రి 9 గంటలకు మృతి చెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన రవీందర్‌రావు కరీంనగర్‌లో స్థిరపడి జనరల్ సర్జన్‌గా వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం ప్రతిమ మెడికల్ కాలేజీలో డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)గా సేవలందిస్తున్నారు. ఆయన మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావుకు బావ మరిది. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రవీందర్‌రావు హైదరాబాద్‌లోని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మరణంపై ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రఘురామన్, ఇతర వైద్యులు సంతాపాన్ని తెలిపారు. రవీందర్‌రావు అంత్యక్రియలు స్వగ్రామం కోరెంలో గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హరియానా గవర్నర్ సంతాపం

భగత్‌నగర్: డాక్టర్ సీహెచ్ రవీందర్ రావు మృతికి హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బుధవారం సంతాపాన్ని ప్రకటించారు. కరీంనగర్‌లో అనేక మందికి వైద్య సేవలు అందించి పేరు ప్రఖ్యాతులు గడించారన్నారు. 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించి తనతోపాటు అనేక మందిని మిసా చట్టం కింద ప్రభుత్వం హైదరాబాద్‌లోని చంచల్ గూడా జైలులో నిర్బంధించిందని, రవీందర్‌రావు జైలు వైద్యుడిగా తమకు సేవలందించారని గుర్తు చేసుకున్నారు.

21న యోగా దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డైటీషియన్ దీప్తి తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరం యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ థీమ్‌తో యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 సంవత్సరాల క్రితం యూఎన్‌వోలోని 175 దేశాలు ముక్తకంఠంతో మద్దతు తెలుపగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం అమలుకు నోచుకుందన్నారు. ప్రతీ ఒక్కరు ఈ సంవత్సరం యోగాతోపాటు ఒక మొక్కను నాటాలని ప్రధాన మంత్రి మోదీ పిలుపునిచ్చారని పేర్కొన్నారు. దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యంతో జీవించాలన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ ధర్నా


లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జిపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి నిర్మించి వర్షాకాలం కష్టాలను తీర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జిపై బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూళం కళ్యాణ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి సంవత్సరమైనా పనులు చేపట్టడంలో నిర్లక్షం చేస్తున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో గంగాధర, పెగడపల్లి, రామడుగు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. ధర్నాతో ట్రాఫిక్ నిలిచిపోగా ఎస్సై వంశీకృష్ణ విరమింపజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల ప్రశాంత్, నాయకులు మల్యాల వినయ్ సాగర్, ఇనుకొండ నర్సింహారెడ్డి, శశీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు రైతుభరోసా విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు మండలంలోని కాట్నపల్లిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ మహేష్, పట్టణ అధ్యక్షులు చందు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు